క్లుప్తంగా

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



హీరాలాల్ చిత్రపటం వద్ద కృతజ్ఞతలు తెలుపుతున్న సిబ్బంది

పార్వతీపురం: జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త డా.హీరాలాల్ చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి మత్స్యశాఖలో ఆయన చేసిన సేవలను కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య మాట్లాడుతూ హీరాలాల్ కృషితో గణనీయంగా కృత్రిమ చేపపిల్లల ఉత్పత్తి పెరిగిందన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం వైస్‌ఛైర్మన్ లక్ష్మణరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాలు గడువులోగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న పీఆర్ ఏఈ చంద్రమౌళి

సీతానగరం: మండలంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ భవనాల నిర్మాణం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సూరంపేటలో అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయం, ,రైతుభరోసా, గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాలను పరిశీలించి నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మొత్తం 58 ప్రభుత్వ భవనాలను నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలియజేశారు. ఇప్పటికే వివిధ గ్రామాల్లో మూడు సచివాలయ భవనాలతో పాటు ఒక రైతుభరోసా కేంద్రం ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలియ జేశారు. అసంపూర్తిగా 51 ప్రభుత్వ భవనాల పనులు ఉన్నాయని, నిర్వాహకులు వాటిని సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, ఆయాగ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శాకంబరీ ఉత్సవాలకు ఏర్పాట్లు



పోలమాంబ అమ్మవారు

మక్కువ: మండలంలోని శంబరలో పోలమాంబ అమ్మవారి ఆలయంలో మంగళవారం శాకంబరీ ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. రకరకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఈఓ వి. రాధాకృష్ణ తెలిపారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: పార్వతీపురం ఆస్పత్రిలోని ఎస్‌సీడీ విభాగంలో డిస్ట్రిక్ క్వాలిటీ మోనటర్ పోస్టుకు ప్రొవిజినల్ మెరిట్ జాబితాను విజయనగరంఏపీ.జీఓవి.ఇన్‌లో పొందుపరిచినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలుంటే ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పార్వతీపురం: విద్యారంగంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు సమస్యలతోకూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, గంగారావు, సింహాచలం, భాస్కర్, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

దోచుకోవడం.. దాచుకోవడమే

టీడీపీ విధానం..

- ప్రజలకు మేలు చేయకపోవడం వల్లే భీ కొట్టారు..
- చంద్రబాబు, లోకేష్‌కు మతి భ్రమించింది: మంత్రి రాజన్నదొర
- టీడీపీ నాయకుల మాటలు అర్థరహితం: ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పక్కనే బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

సాలూరు: దోచుకోవడం.. దాచుకోవడమే టీడీపీ నాయకుల విధానమని.. ప్రజలకు ఎటువంటి మేలు చేయకపోవడం వల్లే ఎన్నికల్లో భీ కొట్టారని డిప్యూటీ సీఎం, మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని తన గృహంలో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుతో కలిసి సోమవారం ఉదయం విలేకరుల సమావేశం నిర్వహించార. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. బొబ్బిలి, విజయనగరంలలో జరిగిన సభల్లో సైకిల్ పోవాలంటూ చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. టీడీపీకి ఓటు వేస్తే మన ఉరి మనమే వేసుకున్నట్లు అని స్వయంగా లోకేష్ అన్నాడని, ఆ వీడియోలు నేటికీ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయన్నారు. బస్సుయాత్ర పేరుతో టీడీపీ నాయకులు చేస్తున్న విమర్శల్లో పస లేదన్నారు. ప్రజలకు మేలు చేసి ఉంటే మాజీలు ఎందుకయ్యారని, ఈ విషయంలో టీడీపీ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. వంద పడకల ఆస్పత్రికి టీడీపీ నాయకులు రాత్రి వేళ శంకుస్థాపన చేశారే తప్ప ఒక్క నిర్మాణం చేపట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చాక యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నామని చెప్పారు. నియోజకవర్గంలో జరుగుతున్న వంతెనలు, రోడ్లు, భవనాలు, తదితర అభివృద్ధి పనులు టీడీపీ నాయకులకు కనిపించకపోవడం శోచనీయమన్నారు. దమ్ముంటే నియోజకవర్గ అభివృద్ధిపై టీడీపీ నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ప్రజలతో మమేకమై వారికి అండగా ఉండడం వల్లే వరుసగా తాను ఎమ్మెల్యేగా గెలుస్తున్నానని.. జనాభిమానాన్ని చూరగొన్న జగన్ మోహన్‌రెడ్డి మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీలోకి వస్తే తనకు రూ. 25 కోట్లు ఇస్తానన్నారని సంధ్యారాణి చెబుతున్నట్లు ఓ పత్రికలో వార్త వచ్చిందని..అయితే ఆమెకు ఆ ఆఫర్ ఎవరు ఇచ్చారో పేరు చెబితే బాగుండేదన్నారు.

చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌లు సైకోలు...

ఎమ్మెల్యే శంబంగి చినఅప్పలనాయుడు మాట్లాడుతూ, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రజలకు మేలు చేయకపోవడంతో వారి మన్ననలు పొందలేకపోయారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌లు సైకోలుగా మారి అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. నాడు అనుమతులు రాకుండా బొబ్బిలిలో ఎత్తిపోతల పథకానికి టీడీపీ నాయకులు శంకుస్థాపన చేసి ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. ఈ ఎత్తిపోతల పథకాల ఆవశ్యకతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో రామభద్రపురం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా గురుకుల బదిలీలు



డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను కలిసిన గిరిజన గురుకుల లెక్చరర్స్ యూనియన్ నాయకులు

- డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన కళాశాల అధ్యాపకులు

సాలూరు:

గురుకుల సిబ్బంది బదిలీలు పారదర్శకంగా చేపట్టినందుకు సహకరించిన డిప్యూటీసీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరకు గిరిజన గురుకుల లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సాలూరులోని నివాసంలో డిప్యూటీసీఎంను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. సిబ్బంది పదోన్నతులు, వయోపరిమితి పెంపు సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, గణపతినాయుడు, యుగంధర్, అప్పలరాజు, కృష్ణారావు, అప్పలనాయుడు, వసంతరావు పాల్గొన్నారు.

250 మందికి వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: గ్రామాల్లో స్వచ్ఛంద సేవా సంఘాలు చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా శ్రీకాకుళం లోని రాగోలులో గల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం తమవంతు శాఖాపరమైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉందని ఏరియా మేనేజర్ ఎ.అబ్రహం అన్నారు. ఈ మేరకు సోమవారం సీతానగరం మండలకేంద్రంలో ఎల్వీఆర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, పెదభోగిలి ఉపసర్పంచ్ అరవింద్‌కుమార్, మాస్ బాలుల ఆధ్వర్యంలో రాగోలు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యునిపుణులు మెగా ఉచితవైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా మేనేజరు అబ్రహం మాట్లాడుతూ గ్రామాల్లో యువతీ యువకులు, స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అలాగే ఎల్వీఆర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో కంటి వ్యాధులు, సుగర్, కీళ్లనొప్పులు,గుండెకు సంబంధించిన, పొట్ట ఉబ్బరం, పొట్టమంట తదితర వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న 250 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. కొంతమందికి రోగ నిర్ధారణ పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. గ్రామాల్లో ఎవరు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తమకు సమాచారం ఇచ్చినా పాల్గొంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్. జయమణి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

జమ్మాన గృహ సందర్శన



నిర్మిస్తున్న గృహాలను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

పార్వతీపురంటౌన్: మండలంలోని లక్ష్మీ నారాయణపురం గ్రామంలో ఏపీ టి డ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ సోమవారం గృహ సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాశ్వత నివాసం లేని నిరుపేదలకు నవరత్నాలు అమలులో భాగంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ఇళ్ల స్థలం మంజూరు చేశామన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారు తప్పక గృహ నిర్మాణం చేసుకుని వారి సొంతింటి కల నిజం చేసుకోవాలని, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం కావాల్సినా తన దృష్టికి తీసుకువస్తే తప్పక ప్రభుత్వ పెద్దల సహాయంతో పరిష్కరించేందుకు సహాయ సహకారాలు అందిస్తానని లబ్ధిదారులకు తెలిపారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన గృహ లబ్ధిదారులను కలిసి మరో 30 సంవత్సరాలు జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగేలా దీవించాలని కోరగా ఇన్ని లక్షల ఆస్తిని తమకు అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని లబ్ధిదారులు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్స్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పెద్ద ఎత్తున ప్రజలు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు

రాజాం సిటీ: తన బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని సాలూరు పట్టణానికి చెందిన వడ్డాది కుమారి ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కె.రవికుమార్ సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 7న రాజాంలోని తన బంధువుల ఇంటికి వచ్చిన కుమారి 8వ తేదీన సాలూరు వెళ్లేందుకు స్థానిక బొబ్బిలి జంక్షన్‌లో రామభద్రపురం వెళ్లే ఆటో ఎక్కింది. అక్కడి నుంచి మరో ఆటోలో సాలూరు వెళ్లింది. ఆమెతోపాటు అదే ఆటోలో రామభద్రపురం వరకు మరో మహిళ కూడా ప్రయాణం చేసింది. కుమారి నిద్రలోకి జారుకోగా ఆమె బ్యాగులో బాక్స్‌తో పెట్టిన 5 తులాల బంగారు వస్తువులను ఆటోలో పక్కన కూర్చున్న మహిళ బ్యాగ్ కట్ చేసి అపహరించింది. ఈ విషయం ఆలస్యంగా గమనించిన కుమారి రాజాం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఒత్తిడితో విద్యార్థిని ఆత్మహత్య

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఫార్మసీ కళాశాల వసతిగృహంలో ఆదివారం రాత్రి బీ ఫార్మసీ విద్యార్థిని గవర అంజలి (21) సీలింగ్ హుక్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భీమిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పార్వతీపురం మన్యం జిల్లా, కొత్తవలస టౌన్, రాజీవ్ కొత్త పోలమ్మ కాలనీకి చెందిన భాస్కరరావుకు ఇద్దరు పిల్లలు. వీరిలో పెద్ద కుమార్తె అంజలి బీ ఫార్మసీ చదువుతూ కళాశాల వసతి గృహంలో ఉంటుంది. గత మూడు రోజులుగా భాస్కరరావు తన కుమార్తె అంజలికి ఫోన్ చేస్తుండగా ముభావంగా మాట్లాడుతూ ఉండేది. ఎందుకు ఇలా ఉంటున్నావని తండ్రి అడగ్గా చదువు ఒత్తిడి కారణంగా రాత్రివేళ నిద్రపోవడం ఆలస్యమవుతోందని చెప్పేది. దీనికి తల్లిదండ్రులు సర్ది చెబుతుండేవారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అంజలి ఉరి వేసుకున్న విషయాన్ని గమనించిన వసతి గృహం సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అంజలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి పోలీస్ స్టేషన్‌కు తరలించి సీఐ కె.లక్ష్మణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.5.97 లక్షలు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. మే నెల 17 నుంచి నేటివరకు 55 రోజులకు గాను హుండీ ద్వారా రూ.5,97,749 ఆదాయం సమకూరినట్లు ఆలయ పర్యవేక్షణ అధికారి వి.రాధాకృష్ణ తెలిపారు. ఆలయ ఈఓ, అర్చకులు సమక్షంలో హుండీ కానుకలను లెక్కించారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే



చినభోగిలిలో గ్రౌండ్ ట్రూత్ సర్వే చేస్తున్న అధికార సిబ్బంది

సీతానగరం: మండలంలో డ్రోన్ సర్వే పూర్తయిన గ్రామాల్లో వీఆర్వోల సహకారంతో గ్రౌండ్ ట్రూత్‌తో సమగ్రమైన భూముల 'రీ'సర్వే చేపట్టామని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు సోమవారం చినభోగిలి, తామరఖండి గ్రామాల్లో రైతుల వద్ద ఉన్న నక్షతో పాటు ఎఫ్‌సీఓ రికార్డుల ఆధారంగా సర్వే అధికారులతో జరుగుతున్న గ్రౌండ్‌ట్రూత్ సర్వేను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జిరాయితీ భూములు అసలు రైతుల పేరున లేవని రికార్డులలో వేరొకరి పేరున ఉన్నట్లు గుర్తించి సరి చేస్తున్నట్లు తెలిపారు. అందుకు అసలైన రైతులు నక్షలు చూపించాలని స్పష్టం చేశారు. జిరాయితీ భూములున్నప్పటికీ క్రయవిక్రయాలు జరగడం రికార్డుల్లో మార్పులు చేయకపోవడంతో ప్రస్తుతం భూముల మార్పు జరగక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూముల క్రయ విక్రయాలు నిర్వహించడానికి, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను నివారించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం భూములకు సంబంధించిన నక్షలున్న రైతుల భూములపై రెవెన్యూ, సర్వే అధికారుల పర్యవేక్షణలో జగనన్న భూరక్ష, భూ హక్కు పథకం ద్వారా శాశ్వత హక్కులు కల్పించడానికి గ్రౌండ్ ట్రూత్ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్వే నిర్వహిస్తున్న గ్రామాల రైతులు నిర్దేశించిన అధికార సిబ్బందికి అవసరమైన వివరాలను అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ పి.చిట్టెమ్మ, మండల సర్వేయర్ శంకరరావు, రైతులు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. పోలీసు అధికారులు వారి పరిధిలో గల సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన నివేదికలను తనకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ ఎన్.శ్రీనివాస రావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ ప్రభాకర్, పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు, ఏఆర్ ఆర్ఐ శ్రీరాములు, డీసీఆర్‌బీ ఎస్సై దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలి..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకుల సవాల్

సాలూరు: మైకుల్లో మాటలు కాదు.. దమ్ముంటే నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని టీడీపీ నాయకులకు వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ విసిరారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ దండి అనంతకుమారి, నాయకులు దండి శ్రీనివాసరావు, ముద్వల ఆదయ్య, పెద్దింటి మాధవ, బీసు, సాంబమూర్తి, తదితరులు మండలంలోని మరిపల్లిలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, బస్సుయాత్ర పేరుతో సాలూరుకు వచ్చిన టీడీపీ నాయకులు నియోజకవర్గ అభివృద్ధిపై కనీస అవగాహన లేకుండా మాట్లాడారని ఎద్దేవా చేసారు. రాజన్నదొర హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే టీడీపీ నాయకులు చర్చకు రావాలన్నారు. ఇంతకుముందు ఎమ్మెల్యేగా పని చేసిన భంజ్‌దేవ్, ఎమ్మెల్సీగా చేసిన సంధ్యారాణిలు తాము చేసిన అభివృద్ధి ఏమిటో తెలుసుకోవాలని హితవుపలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల న రాష్ట్రం శ్రీలంకగా మారిపోతుందని విమర్శించిన టీడీపీ నాయకులు.. మరలా అవే పథకాలకు పేర్లు మార్చి తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామని ఎలా చెప్పారని ప్రశ్నించారు. జన్మభూమి కమిటీలు ప్రజలను ఎలా దోచుకున్నాయో ఇంకా అందరికీ గుర్తున్నాయని చెప్పారు. జగనన్న పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారని.. త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: అభివృద్ధి పనులను తరచూ పర్యవేక్షించాలని మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సోమవారం మాట్లాడారు. జిల్లాలో రానున్న రెండు నెలల్లో 13,198 గృహాల నిర్మాణం పూర్తిచేయాలన్నారు. ఇప్పటిరకు 87 గ్రామ సచివాలయాల భవనాలు పూర్తికాగా 24 అప్పగించారని, 16 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తికాగా మూడు అప్పగించారని తెలిపారు. పాలకొండ మండలంలో రీసర్వే పనులు పూర్తిచేయడంపై కలెక్టర్ ప్రశంసించారు. వీసీలో జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్వో జె.వెంకటరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఒ.ప్రభాకరరావు, డీపీఓ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలతో హాజరుకావాలి



భూ హక్కుదారుల సమక్షంలో వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

పాలకొండ రూరల్:

గ్రామాల్లో జరుగుతున్న భూముల సమగ్ర రీసర్వేకి రైతులు, భూ హక్కుదారులు సహకరించాలని, సర్వే చేపడుతున్న భూముల వద్దకు సంబంధిత హక్కుదారులు పట్టాదారు పాసుపుస్తకాలతో హాజరుకావాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు కోరారు. వీరఘట్టం రహదారిలో ఉన్న తోటల్లో సోమవారం చేపట్టిన రీసర్వేను ఆయన పర్యవేక్షించారు. సర్వే సిబ్బంది ముందస్తుగా అందిస్తున్న సమాచారం మేరకు భూ యజమానులు కచ్చితంగా హాజరుకావాలని కోరారు. దగ్గరుండి వివరాలు నమోదు చేసుకోవాలని, తప్పులు ఏమైనా గుర్తిస్తే వెంటనే సర్వే బృందాలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సర్వేలో తప్పులు జరగకుండా రోవర్, డ్రోన్ వంటి సాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్వోలు సాయి శ్రీనివాస్, రామారావు, సహాయ సర్వేయర్లు జి.గణేష్, మణి, నాగరాజు తదితరులున్నారు.

కామ్రేడ్లు సత్యం, కైలాసంకు ఘన నివాళి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: గిరిజనుల హక్కుల కోసం శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటం నడిపిన కామ్రేడ్లు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం 53వ వర్ధంతి సభను కురుపాం మండలం గుమ్మ గ్రామంలో సోమవారం సీపీఐ నాయకులు నిర్వహించారు. వెంపటాపు సత్యం కుమార్తె వెంపటాపు భారతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మన్యం ప్రాంతంలో గిరిజనుల హక్కుల కోసం, పాలేరు వ్యవస్థ రద్దు కోసం, అటవీ భూములు పంపిణీ చేయాలని కోరన్న, మంగన్నలు తొలుత పోరాటం సాగించారన్నారు. వారు అమరులైన తర్వాత ఈ పోరాటాన్ని సత్యం, కైలాసం ముందుకు నడిపారని అన్నారు. వారి పోరాటాల ఫలితంగానే గిరిజనులకు అనేక హక్కులు కల్పించబడ్డాయన్నారు. వారి పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, ఇతర కమ్యూనిస్టు పార్టీలు, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.